సాక్షి
జోగులాంబ గద్వాల

బుధవారం । 1 । మే । 2024



వైభవంగా కల్యాణోత్సవం

శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు.

వివరాలు IIలో ▸



మీ బిడ్డగా పోటీలో నిలిచా..

మీ బిడ్డను నేను.. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు.

వివరాలు IIలో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
45.6 /25.7

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం సమయంలో ఉక్కపోత ఉంటుంది. తీవ్రమైన వడగాల్పులు వీస్తాయి.

పదిలో వెనుకబాటు

రాష్ట్ర స్థాయి ర్యాంకుల్లో జిల్లా 32వ స్థానం



ప్రతిభ చాటిన పదో తరగతి విద్యార్థులను అభినందిస్తున్న అడిషనల్ కలెక్టర్ అపూర్వ్ చౌహాన్

- ఆశించిన స్థాయిలో రాణించని విద్యార్థులు
- ఉత్తీర్ణతలో బాలికలదే పై చేయి
- 81.38 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత
- బాలికలు 83.97 శాతం, బాలురు 78.67 శాతం ఉత్తీర్ణత

గతంలో పదో తరగతి ఫలితాలు ఇలా..

విద్యా సంవత్సరం	మొత్తం విద్యార్థులు	ఉత్తీర్ణులైన వారు	ఉత్తీర్ణత శాతం
2016-17	6,763	5,376	79.49
2017-18	7,200	5,483	76.15
2018-19	7,521	6540	86.96
2019-20, 2020-21 విద్యా సంవత్సరం కోవిడ్ కారణంగా అందరు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.			
2021-22	7,920	6,783	85.64
2022-23	7,175	5,790	80.70

గద్వాల: పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయారు. అయితే ఉత్తీర్ణత శాతం స్వల్పంగా పెరిగినా.. రాష్ట్రస్థాయి ర్యాంకులో మాత్రం వెనుకబడింది. మంగళవారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోని 33 జిల్లాల్లో జోగులాంబ గద్వాల జిల్లా 32వ స్థానంతో సరిపెట్టుకోవడం తీవ్ర నిరాశ కల్గించింది. గత ఏడాది 27వ ర్యాంకు ఉండగా.. ఈ ఏడాది చతికిలపడింది. జిల్లా వ్యాప్తంగా 7,175 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 5,839 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జిల్లా సరాసరి ఉత్తీర్ణత 81.38 శాతంగా నమోదైంది. వీరిలో 3,512 మంది బాలురకు.. 2,763 మంది ఉత్తీర్ణత సాధించి 78.67 శాతంతో సరిపెట్టుకున్నారు. 3,663 మంది బాలికలు పరీక్షలు రాయగా 3,076 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 83.97 శాతంతో బాలుర కంటే కొంత పైచేయి సాధించారు. అక్షరాస్యతలో వెనకంజలో ఉన్న ఈ జిల్లాలో పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధించినప్పటికీ సర్దుబాటుతో వాటిని భర్తీ చేయగలిగారు.

'పది'ంతల కారణాలు..

2019–20, 2020–21 విద్యా సంవత్సరాల్లో పరీక్షలు లేకుండానే అందరినీ ఉత్తీర్ణులుగా ప్రకటించారు. ఆ తరువాత వచ్చిన ఏడాదిలో ఓ మోస్తరుగా మంచి ఉత్తీర్ణతే సాధించారు. ప్రస్తుత ఏడాది పరీక్షల నిర్వహణలో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు అదనపు తరగతులు, భూమిక, రీడ్ తదితర కార్యక్రమాలను అమలు చేసినా ఆశించిన ఫలితం ఇవ్వలేదు. రాష్ట్రస్థాయి ర్యాంకులో జిల్లా వెనకబడింది.

- చదువులో వెనకబడిన విద్యార్థులు ప్రత్యేక తరగతులు నిర్వహించినా అనేక మంది గైర్హాజరయ్యారు. కొన్ని పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ వహించలేదు. పరీక్ష పేపర్లను 11 నుంచి ఆరుకి కుదించినా పూర్తిగా కలిసి రాలేదు.
- ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, 317జీవో, ఎన్నికలు విధులు అంటూ చాలా రోజులు ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. దీంతో చాలా పాఠశాలలో చదువులపై అంతగా శ్రద్ధ చూపకపోవడమూ వెనుకబాటుకు కారణంగా కనిపిస్తోంది.
- ఈ విద్యాసంవత్సరం మధ్యలోనే రెగ్యులర్ డీఈఓ వెళ్లిపోయారు. పరీక్షల సమయంలో ఇన్‌చార్జి డీఈఓతో నెట్టుకొచ్చారు. డీఈఓ వారంలో రెండు, మూడు రోజులు, ఎంఈఓలు నిత్యం పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయు బోధన, విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించాల్సి ఉంది. అందుకు అనుగుణంగా సూచనలు, ఆదేశాలు జారీ చేయాలి. ఒక్కో ఎంఈఓకు రెండు, మూడు మండలాలు ఇన్‌చార్జి బాధ్యలు అప్పగించడంతో సరైన పర్యవేక్షణ లేకుండా పోయింది. రాజకీయ ఒత్తిళ్లతో నిర్లక్ష్యంగా ఉన్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోలేకపోయారు.

మెరిసిన జిల్లా విద్యార్థులు..

జిల్లా వ్యాప్తంగా 25 పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో జెడ్పీ ఉన్నత పాఠశాలలు రెండు, బీసీ సంక్షేమ గురుకులాలు రెండు, సాంఘిక సంక్షేమ గురుకులాలు మూడు, కేజీబీవీ ఒకటి, ప్రైవేటు పాఠశాలలు 17 ఉన్నాయి. అలాగే, మొత్తం 11 పాఠశాలల నుంచి 34 మంది విద్యార్థులకు 10/10 జీపీఏ పాయింట్లు వచ్చాయి. వీటిలో ప్రభుత్వ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎనిమిది మంది, ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఒకరు ఉండగా... గద్వాల విశ్వభారతి టెక్నో స్కూల్‌కు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు పది జీపీఏ పాయింట్లు సాధించిన వారిలో ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో గద్వాల ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి మదన్ 10 జీపీఏ పాయింట్లు సాధించి సత్తాచాటారు.

గర్వంగా ఉంది



ఉపాధ్యాయుల సూచనల మేరకు ఎప్పటికప్పుడు నోట్ తయారు చేసుకుని పాఠ్యాంశాలపై పట్టు సాధించాను. నిత్యం పరీక్షలు పెట్టడం, ముఖ్యమైన విభాగాల్లో మార్కులు ఎక్కువ సాధించే మెలకువలు చెప్పడంతో రాణించా. పది జీపీఏ పాయింట్లు రావడం గర్వంగా ఉంది. ఇంటర్‌లో ఎంపీసీ తీసుకుని ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించడమే నా కల. ఈ ఫలితం వెనుక తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి మరవలేనిది.
– మదన్, గద్వాల

ఐఏఎస్ అవడమే నా లక్ష్యం



నా తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ నన్ను చదివించారు. పుల్లూరు మహాత్మా జ్యోతీరావుపూలే గురుకుల పాఠశాలలో సీట్ సంపాదించి ఉపాధ్యాయుల బోధనకు తగ్గట్టు అన్ని సబ్జెక్టుల్లో 10/10 సాధించాను. ఐఏఎస్ కావాలనేదే నా లక్ష్యం. కష్టపడి చదివి నా లక్ష్యాన్ని చేరుకుంటా.
– స్వాతి, బిజ్వారం, మల్దకల్ మండలం

ప్రణాళికతో చదివా..



మా పాఠశాలలో పదో తరగతిలో ప్రణాళికతో విద్యాబోధన చేశారు. కుటుంబంలో మా ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు అందించిన ప్రాధ్యలంతో పది పరీక్షల్లో 10 జీపీఏ సాధించడానికి అవకాశం కలిగింది. మా కరస్పాండెంట్ అందరిపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో మంచి గ్రేడ్ సాధించాం.
– సంతోష్, 10 జీపీఏ, గురుదేవ్ పాఠశాల, అలంపూర్

ఉత్తమ బోధనతోనే..



మా అమ్మ నాన్న ఆశీర్వాదం, ఉపాధ్యాయుల ఉత్తమ బోధనతోనే పదో తరగతి ఫలితాల్లో 10/10 జీపీఏ సాధించాను. బాగా చదివి డాక్టర్ అవుతా. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే నా లక్ష్యం.
– రోజామని, ఉదండాపురం, ఇటిక్యాల మండలం

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా



మాది పేద కుటుంబం. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి కుటుంబాన్ని పోషిస్తున్నారు. వారి కష్టాన్ని చూస్తూనే చదువుతున్నా. బాగా చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయ్యి తల్లిదండ్రుల కష్టాలన్ని తీర్చుతా. గురుకుల ఉపాధ్యాయుల సూచనలు తూచా తప్పక పాటించడంతోనే 10కి 10 జీపీఏ సాధించా.
– మానస, పెద్దపాడు, ధరూరు మండలం

న్యూస్‌రీల్

5న ఎర్రవల్లిలో సీఎం బహిరంగ సభ



ఎర్రవల్లిచౌరస్తా: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మే 5న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎర్రవల్లి మండల కేంద్రంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరువుతారని అన్నారు. దీనికోసం అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవితో కలిసి ఆయన సభా స్థలాన్ని సందర్శించి రోడ్డు, తదితర వసతులను పరిశీలించారు. ఆయా మండలాలకు చెందిన పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కొప్పుల లక్ష్మీనారాయణరెడ్డి, సోమనాద్రి, మాణిక్యారెడ్డి, మదునాయుడు, మద్దిలేటి, నీలి శ్రీను, రాజ్‌కుమార్, శ్యామ్, నర్సింహులు, బజారి, వెంకటేష్‌ఉన్నారు.

పోలీసు కుటుంబాలకు ఆర్థిక భద్రత



గద్వాల క్రైం: విధుల్లో గుండెపోటుతో మృతి చెందిన ఇటిక్యాల ఏఎస్ఐ అయ్యన్న కుటుంబ సభ్యులకు మంగళవారం ఎస్పీ రితిరాజ్ రూ.8లక్షల బీమా చెక్కును అందజేసి వారితో మాట్లాడారు. ఇతర ప్రయోజనాల ద్వారా వచ్చే ఎక్స్‌గ్రేషియా త్వరలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు కుటుంబాల ఆర్థిక భద్రత కోసం ప్రత్యేక చర్యలు ప్రభుత్వం తీసుకుందన్నారు.

బీఆర్ఎస్‌ను ఆదరించండి

పెబ్బేరు రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా మంగళవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఉదయం పెబ్బేరు మండల కేంద్రంలో పీజేపీ క్యాంప్‌లో మర్నింగ్‌వాక్‌లో పాల్గొని పట్టణ వార్డుల్లో తిరుగుతూ పట్టణ ప్రజలు, పండ్లు, కూరగాయలు, టీకొట్టు, వ్యాపారుస్తులు, క్రీడాకారులను కలుస్తూ వారితో మాట్లాడారు. కారు గుర్తుకు ఓటువేసి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతు రుణమాఫి అని ముందుకు వచ్చి రైతులను మరోసారి మోసం చేసేందుకు చూస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలించిన పదేళ్లలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రె స్వామి, దిలీప్‌రెడ్డి, విశ్వరూపం పాల్గొన్నారు.

పాఠశాలల్లో మరమ్మతు పనులు పూర్తి చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల రూరల్: ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన మరమ్మతు పనులను వేగవంతం చేసి జూన్ మొదటివారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 460ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు చదువుకునేలా సుందరీకరంగా పనులు పూర్తి చేయాలన్నారు. జూన్ మొదటి వారంలో మన ఊరు– మన బడి కింద 160పాఠశాలలో చేపట్టిన పనులను పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా తరగతి గదులు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల వంటి మౌళిక వసతుల పనులు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే అన్ని పాఠశాలలో కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో నర్సింగ్ రావు, పీఆర్ ఈఈ విజయ్‌కుమార్, మిషన్‌భగీరథ ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి మల్లురవి, చిత్రంలో జెడ్పీచైర్‌పర్సన్ సరిత, ఏఐసీసీ కార్యదర్శి సంపత్

- కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం
- నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి
- జెడ్పీచైర్‌పర్సన్ వర్గం, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి మధ్య మరోసారి వాగ్వాదం
- ప్రచార స్టిక్కర్లపై నెలకొన్న వివాదం



వాగ్వాదానికి దిగిన అమరవాయి కృష్ణారెడ్డి, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి

గద్వాల అర్బన్: కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లురవి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జమ్మిచేడులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయనతోపాటు ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లురవి మాట్లాడుతూ.. గత పదేళ్లుగా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రజా సంక్షేమాన్ని మరిచాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన అయిదు గ్యారంటీలను ప్రజల్లోకి విస్తతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొంతమంది కాంగ్రెస్‌పై బురదజల్లె ప్రయత్నం చేస్తున్నారని, ఎవరూ కూడా అపోహలకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని చెప్పారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఆనంతరం పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో కొన్ని పథకాలు అమలు కాలేదని, ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేస్తాందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆశీర్వాదించాలని కోరారు.

ఇరువర్గాల వాగ్వాదం

ఇదిలాఉండగా, కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. జెడ్పీ చైర్‌పర్సన్ సరిత వర్గానికి, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డికి మరోసారి వివాదం చోటు చేసుకోవడం హాట్‌టాపిక్‌గా మారింది. ఎన్నికల సందర్భంగా ముద్రించిన పాంప్లెట్స్(స్టిక్కర్స్)లో తన ఫొటో ఉండడంతో వాటిని అతికించడం లేదని బండ్ల చంద్రశేఖర్ రెడ్డి సమావేశంలో లేవనెత్తారు. అయితే ఇక్కడ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ఇంచార్జ్, దాంతో మీ ఫొటో ఉన్న పాంప్లెట్ అతికించాల్సిన అవసరం లేదని జెడ్పీ చైర్‌పర్సన్ వర్గీయుడైన అమరవాయి కృష్ణారెడ్డి చెప్పారు. దీంతో వారిరువురి మధ్య వాగ్వాదం చేసుకొంది. ఓ క్రమంలో నువ్వెవరు నాకు చెప్పడానికి.. అంటూ బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి అమరవాయి కృష్ణారెడ్డిపై మండిపడ్డారు. ఈ వాగ్వాదం మల్లురవి ఎదుటే చోటు గమనార్హం. అదేవిధంగా బండ్ల చంద్రశేఖర్‌రెడ్డిని వేదికపైకి పిలవగా వెళ్లేందుకు నిరాకరించారు. దీంతో మల్లు రవి ఇరువర్గాలను సముదాయించారు. మొత్తంగా పార్లమెంట్ ఎన్నికల వేళ గద్వాల కాంగ్రెస్ నాయకులు వర్గాలుగా విడిపోయి వాగ్వాదాలు.. దాడులు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

- జిల్లా కేంద్రంలోని దౌదర్‌పల్లిలో, మోమిన్ మహెల్లాలో మల్లురవి, సరిత, నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. గత పదేళ్లుగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజా సమస్యలు, అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు.

యువత తీర్పే కీలకం

- సగం మంది 40ఏళ్ల లోపు ఓటర్లు
- పార్లమెంటు ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ అభ్యర్థుల అంచనాలు
- కొత్త ఓటర్లపై ప్రత్యేక దృష్టి



నాగర్‌కర్నూలు లోక్‌సభ నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు
	8,64,034	8,70,694	45
	మొత్తం ఓటర్లు 17,34,773		

అచ్చంపేట: సార్వత్రిక ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం గెలుపోటములపై యువ ఓటర్లు కీలక భూమిక పోషించనున్నారు. సోమవారం నాటికి నామినేషన్ల ఉపసంహరణ ముగియడంతో బరిలో మిగిలిన 19 మంది అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రచారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు దూసుకుపోతున్నారు. ఈ క్రమంలో విభాగాల వారీగా ఓటర్ల సంఖ్యను బట్టి హామీలు గుప్పిస్తు ముందుకు సాగుతున్నారు. అధికారులు ప్రకటించిన జాబితాలో యువ ఓటర్ల సంఖ్య అధికంగా ఉండడంతో అభ్యర్థులు వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

పార్టీల యువమంత్రం

అధికశాతం గ్రామీణ ప్రాంతాలు కావడంతో పోలింగ్ 70 శాతానికి పైగానే ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో కొంత తక్కువగా ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య లేదు. 18ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవడం కోసం ఏప్రిల్15 వరకు భారత ఎన్నికల సంఘం ఇచ్చిన అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకున్నారు.

అన్ని పార్టీల ఆశలు..

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని నాగర్‌కర్నూలు, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, వనపర్తి, అలంపూర్,గద్వాల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న యువ, వయోజన ఓటర్లు తమకే ఓటు వేస్తారంటే, లేదు తమకే వేస్తారని ప్రధాన రాజకీయ పార్టీలు అంచనాలు వేసుకుంటున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఐదు కాంగ్రెస్, రెండు బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచారు. అదే ఊపుతో ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్‌కే ఓటు వేస్తారని నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. శాసనసభ ఎన్నికలు వేరు, పార్లమెంట్ వేరని, యువత, మధ్య వయసు వారు బీజేపీ వైపు మొగ్గు చూపుతారని కమలనాథులు అంటున్నారు. గత ఎన్నికల్లో ఓటర్లు చేసిన తప్పును సరిచేసుకునే ప్రయత్నంలో ఉన్నారని, ఈసారి బీఆర్ఎస్‌నే గెలిపిస్తారనే నమ్మకం ఉందని గులాబీ నాయకులు అంటున్నారు.

60,378 యువ ఓటర్లు..

నాగర్‌కర్నూల్ లోక్‌సభలో ఏడు నియోజకవర్గాల పరిధిలో యువకులు ఘణనీయంగా తమ ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. 18–19 ఏళ్ల వయస్సు గల 60,378 మంది కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. ఇందులో 34,670 మంది అబ్బాయిలు, 25,699 మంది అమ్మాయిలు, ఇతరులు 9 మంది ఉన్నారు. మొత్తం 17,34,773 ఓటర్లు ఉండగా, సగం మంది 40 ఏళ్ల లోపు వారే ఉండటం గమనార్హం. కాగా మొత్తం ఓటర్లలో మహిళా ఓటర్లు అధికంగా ఉండగా, ఆమె తీర్పుతో పాటు, 40ఏళ్లలోపు వారి ఓట్లు కీలకంగా మారాయి.

సగం మంది వారే..

18–19 ఏళ్ల లోపు ఓటర్లు 60,378 మంది, 40ఏళ్ల లోపు వారు 9,02,081 మంది ఉన్నారు. అంటే మొత్తం ఓటర్లలో సగం మంది ఓటర్లు ఈ వయసు వారే కావడం గమనార్హం. అదేవిధంగా ఓటు వేసేది కూడా వీరే ఎక్కువగా ఉంటారు. అభ్యర్థి గెలుపోటములపై వీరి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ వయసు వారు ఎవరికి మద్దతు తెలిపితే వారే పార్లమెంట్‌లో జెండా ఎగరవేసే అవకాశం ఉంటుందని రాజకీయవర్గాల్లో చర్చ. అభివృద్ధి, పరిపాలన, అభ్యర్థి పనితీరును బట్టి సమగ్రంగా ఆలోచించి ఓటేసే వారు కావడంతో పార్టీల అభ్యర్థులు వీరిని ఆకట్టుకునేందుకు ప్రణాళికలు చేసుకుంటున్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన

- ప్రజలు ఆశీర్వదిస్తే నడిగడ్డ గొంతుకను ఢిల్లీలో వినిపిస్తా
- నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్



రాజోళి రోడ్‌షోలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్

శాంతినగర్/రాజోళి/ఎర్రవల్లిచౌరస్తా/మానవపాడు: బీజేపీ పార్టీని ప్రజలు ఆదరించి గెలిపిస్తే దేశంలో మరోసారి సుస్థిర ప్రభుత్వం.. పాలన అందుతుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ పార్టీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ అన్నారు. మంగళవారం జిల్లాలోని శాంతినగర్, ఎర్రవల్లి, రాజోళి, మానవపాడులో ఆయన ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలు..రోడ్‌షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్‌ప్రసాద్ మాట్లాడుతూ.. అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి పేదలకు న్యాయం చేసిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకి దక్కుతుందన్నారు. మళ్లీ బీజేపీని ఆదరిస్తే అవినీతిని కూకటి వేళ్లతో తొలగించి, పేదల రాజ్యం తీసుకువస్తాడని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపికి ఓటు వేసి నాగర్‌కర్నూల్ ఎంపీగా గెలిపిస్తే నడిగడ్డ ప్రజల గొంతుకను పార్లమెంట్‌లో వినిపించి, జిల్లా అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని అన్నారు. గతంలో రైల్వే లైన్ సాధన కోసం ఎంపీ రాములు చేసిన కృషిని ఆయన తెలియజేశారు. దేశంలో అవినీతి రహిత పాలన కోసం, శాంతి భద్రతల పరిరక్షణ కోసం, పేదల సంక్షేమం కోసం బీజేపిని గెలిపించాలని ఆయన కోరారు.

- ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి అభయాంజనేయస్వామి ఆలయాన్ని ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎర్రవల్లి కూడలిలో మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు స్థానిక వ్యక్తికి అవకాశం ఇవ్వాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశాయన్నారు. కార్యక్రమంలో అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు మధుసూదన్‌గౌడ్, రామకృష్ణ, కేకే రెడ్డి, బాలరాములరెడ్డి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

'రిషి' విజయకేతనం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని రిషి పాఠశాల విద్యార్థులు ఎస్సెస్సీ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. ఈ మేరకు పాఠశాల విద్యార్థులు 11 మంది 10కి 10 జీపీఏ పాయింట్లు సాధించారు. మరో 11 మంది 9.8 జీపీఏ, 9 మంది 9.7 జీపీఏ, 19 మంది 9.5 జీపీఏ, 82 మంది సాధించారు. ఈ మేరకు ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, పాఠశాల యాజమాన్యం అభినందించింది.

FORMAT C-1 TO C-3
FORMAT C-1
(For Candidate to Publish in News Papers, TV)

Declaration about criminal cases

(As per the judgment dated 25th September 2018 of Hon'ble Supreme Court In WP (civil) O. 536 of 2011 (public interest foundation & ors. Vs. Union of India & Anr.)

I, **SMT.D.K ARUNA @ ARUNDHATHI** husband`s name **D.K. BHARATH SIMHAREDDY, Aged about 64 years,** Her Postal Address **H.No.8-6-213, PADMAVATHI COLONY, MAHABUBNAGAR TOWN, 11.MAHABUBNAGARDISTRICT**(74-Assembly constituency comprised withing) **MAHABUBNAGAR** Parliamentary (Constituenccy) (1) I am a candidate setup by-**BHARATIYAJANATAPARTY WHIH IS A RECOGISED NATIONAL PARTY.**

I, **SMT.D.K ARUNA @ ARUNDHATHI** a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

Table-I

(a)	FIR No. with name and address Of Police Station concerned	FIR No.188/2018 Police Station Maldakal, Maldakal Mandal, JogulambaGadwal Dist.	FIR.No.324/2018 Police Station, Gadwal Town, PS, Jogulamba Gadwal Dist.	FIR.NO.36OF2024 Police Station Utkoor PS. Narayanpet District
(b)	Case No. with name of the court	359/2019 Judicial Magistrate of First Class at Gadwal Town, Joguamba Gadwal District	No (Not Numbered in trial court) Judicial Magistrate of First Class at Gadwal Town JogulambaGadwal District	No (Not Numbered in trial court) Judicial Magistrate of First Classat Narayanpet and District
(c)	Section(s) of concernedActs/Codes involved(give no, of thesection,e.g. Section ofIPC,etc.)	UnderSection188of IPC. Police StationMaldakal Mandal.	UnderSection188of IPC. Police Station,Gadwal Town, PS, JogulambaGadwal	Under Section 188 ofIPC and sec 26 TS Dist. Police Act 1329f of Utkoor PS.
(d)	Brief description of offence	Disobedience to order duly promulgated by public servant	Disobedience to order duly promulgated by public servant.	Disobedience to order duly promulgated by public servant. Penalty for violating provisions contained in sections 23, 24 and 25
(e)	Whether chargeshavebeen-farmed(mentionYES or NO)	YES	NO	NO
(f)	If answer against (e) above is YES,then give the date on which charges were farmed	Dated. 30-05-2023	Not Applicable	Not Applicable
(g)	Whether any Appeal / Applicationon for revision proceedings(MentionYES or NO)	NO	NO	NO

Table-II

(a)	FIR No. withnameandaddressOf Police Stationconcerned	FIR No.27/2020 Police StationGadwal Town,Jogulamba Gadwal Dist.	FIR.No.23/2020 Police Station,K.T.Doddi K.T.DoddiMandal.	FIR.NO.330/2021 PoliceStation GadwalTown,Jogulamba Gadwal District
(b)	Case No. with name of the court	C.C.No.457/2021 JudicialMagistrate ofFirstClassat GadwalTown	No (not numbered in trial court)Judicial Magistrate of First Class at Gadwal Town.	No,(not numbered in trial court) Judicial Magistrate ofFirst Class at GadwalTown
(c)	Section(s) of concernedActs/Codes involved(give no, of thesection,e.g. Section ofIPC,etc.)	UnderSection188 of IPC. Police Station GadwalTown	No (not numbered in trial court) Judicial Magistrate of First Class at Gadwal Town.	Under Section 188 of IPC.PoliceStation GadwalTown
(d)	Brief description of offence	Disobedience to order duly promulgated by public servant.	Disobedience to order duly promulgated by public servant. Punishment for bribery Illegal payments in connection with an election Acts done by several persons in furtherance of common intention Corrupt practices	Disobedience to order duly promulgated by public servant.
(e)	Whether chargeshavebeenfarmed (mention YES or NO)	NO	NO	NO
(f)	If answer against (e) above is YES,then give the date on which charges were farmed	Not Applicable	Not Applicable	Not Applicable
(g)	Whether any Appeal / Applicationon for revision proceedings (MentionYES or NO)	NO	NO	NO

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు పట్టణంలో మంగళవారం రాత్రి ఆధ్యాత్మికం, భక్తి భావం ఉట్టిపడింది. జిల్లా బ్రాహ్మణ సేవా సమితి, పరశురామ బ్రాహ్మణ అర్చక పురోహి త సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశా ల మైదానంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీని వాస కల్యాణ మహోత్సవం వైభవంగా ప్రారంభమైంది. ఈ మహోత్సవానికి కళాశాల మైదానంలో భారీస్థాయిలో ఏర్పాట్లు చేశారు. ముందుగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం వేదపఠనం, సహస్ర దీపాలంకరణ సేవ, ఎదుర్కోళ్లు నిర్వహించారు. ప్రముఖ గాయకులు గద్వాల చంద్రశేఖరరావు అన్నమయ్య సంకీర్తనా కచేరీ అలరించింది. అదిగో అల్లదిగో అంటూ భక్తిగానంతో సంకీర్తనా కచేరీని ప్రారంభించారు. బుధవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.

ప్రత్యేక పూజలు..

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ దీపాలంకరణ సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నమయ్య సంకీర్తలను తిలకించా రు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా స మితి జిల్లా అధ్యక్షుడు కొల్లూరు భీమాచార్యులు, ప్రధాన కార్యదర్శి గొండ్యా ల రాఘవేంద్రశర్మ, పరశురామ అర్చ క పురోహిత సంఘం అధ్యక్షులు జోషి సంతోషాచార్యులు, ప్రధాన కార్యదర్శి ప్రదీప్ ఆచార్య, తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, శ్రవణ్, ఇరువింటి శ్రవణ్‌కుమార్‌శర్మ, సుమన్‌శర్మ, గంగాపురం పవన్‌కుమార్‌శర్మ, గుండ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

హజ్‌యాత్ర అవకాశం రావడం అదృష్టం

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర హజ్ యాత్ర చేయడానికి అవకాశం రావడం ఎంతో అదృష్టమని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ కన్వెన్షన్‌లో జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం హజ్‌యాత్రికులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్మన్ కొత్వాల్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ శిబిరాల వల్ల హజ్ యాత్రికులకు యాత్రకు సంబంధించిన అవగాహన కలుగుతుందన్నారు. దేశం, రాష్ట్రం, జిల్లా ప్రజల క్షేమం కోసం హజ్‌యాత్రలో ప్రత్యేక దువా చేయాలని కోరారు. జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఢిల్లీకి చెందిన చీఫ్ హజ్ ట్రైనర్ మహ్మద్ మోనీస్‌ఖాన్ హజ్‌యాత్రకు సంబంధించి అవగాహన కల్పించారు. డిజిటల్ హజ్ ట్రైనింగ్ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ మహమూద్‌అలీ, చీఫ్ ప్యాట్రన్ రవూఫ్, సత్తార్, రజాక్ నిజామీ, యూసుఫ్, అహ్మద్ పటేల్, ఎండీ రఫీక్, ఖాజా నిజాముద్దీన్, రజాక్, కలీం, ఎండీ ఇషాక్, రఫీక్ ఉర్ రెహమాన్, మూసా, ఎండీ అర్షద్‌అలీ, ఎండీ సిద్ధిఖ్, హైదర్‌అలీ, సిరాజ్ పాల్గొన్నారు.

గ్యారంటీలు ఇచ్చేది లేదు.. అధికారంలోకి వచ్చేది లేదు


కొత్త మొల్గరలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి డీకే అరుణ

ప్రచార పర్వం

భూత్పూర్: కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు ఇచ్చేది లేదు.. మళ్లీ అధికారంలోకి వచ్చేది లేదని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. మంగళవారం భూత్పూర్, మూసాపేట మండలాల్లోని కొత్త మొల్గర, జానంపేట, వేముల, అడ్డాకుల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మోసపూరిత హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.2,500 భృతి, రూ.15వేల రైతుబంధు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఆడపిల్ల పెళ్లికి రూ.లక్ష ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి, ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. కేంద్రంలో మళ్లీ మోదీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు తొలగిస్తారని సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తూ ఓట్లు దండుకోవడానికి యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో విద్య, వైద్యం, పేదరికంపై నిర్లక్ష్యం చేశారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ప్రతి పేదకు ఇల్లు మంజూరు చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. కాగా, వెల్కిచర్ల, కరివెన, పోతులమడుగు, లంబడికుంట తండా, కోర్లవంపు తండాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు 100 మంది డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ పవన్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎగ్గని నర్సింహులు, రవీందర్‌రెడ్డి, కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఫారూఖ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు అభివృద్ధి కోసం ఓటెయ్యండి


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

దేవరకద్ర రూరల్/చిన్నచింతకుంట: పాలమూరు అభివృద్ధికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి కోరారు. మంగళవారం కౌకుంట్ల మండలంలోని ముచ్చింతలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కోసం రాష్ట్రాన్ని సాధిస్తే.. కేసీఆర్ కుటుంబ పాలన చేశారని విమర్శించారు. పాలమూరు ఓట్లతో రాజకీయ పునర్జన్మ పొందిన కేసీఆర్.. గద్దెనెక్కిన తర్వాత నిధులు, నియామకాలు ఆయన కుటుంబానికి, నీళ్లను ఆంధ్రాకు తరలించారని ధ్వజమెత్తారు. కులమతాల పేరిట దేశాన్ని ముక్కలు చేస్తూ.. వ్యవసాయ, విద్య, వైద్య రంగాలను కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టిన బీజేపీని గద్దె దింపావల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు.

■ దేశంలో యువతకు ఉపాధి కల్పించడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా పుట్టపల్లి, వెంకటగిరి, రేకులంపల్లి, ఇస్రంపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ పాలనలో అసంతృప్త ప్రజల దృష్టిని మరలించేందుకే బీజేపీ రాముడిని, మతాన్ని వాడుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు, గోవర్ధన్‌రెడ్డి, మహిపాల్, శ్రీను పాల్గొన్నారు.

మల్లురవి గెలుపునకు కృషి చేయాలి: మంత్రి జూపల్లి


కోడేరులో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కోడేరు: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ బీజేపీలను చిత్తుగా ఓడించాలని, ఆ పార్టీల నాయకుల మాటలు ఎవ్వరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో ఎంపీ సీట్లు అన్ని కైవసం చేసుకొని రాహుల్ గాంధీని పీఎం చేసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పథకాలు అమలు కాలేదని, కాంగ్రెస్ పార్టీనే ప్రజలకు అనేక పథకాలు అందుతాయన్నారు. దేశం అభివృద్ధి కావాలంటే ఇండియా కూటమి అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్త రాంమోహన్‌రావు, బస్తీరాంనాయక్, కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్‌ఖరీం, జగదీశ్వరావు, నక్క వేణుగోపాల్‌యాదవ్, మహేశ్వరెడ్డి, కృష్ణయ్యగౌడ్, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

మీ బిడ్డగా పోటీలో నిలిచా..: ఆర్‌ఎస్‌పీ


మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కొల్లాపూర్: మీ బిడ్డను నేను.. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీలో నిలిచా.. గెలిపిస్తే మీ గొంతుకను ఢిల్లీలో వినిపిస్తా అని బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో మాదిగల ఐక్యవేదిక సభ నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమం కోసం నేను కృషిచేస్తా. తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్ నన్ను ఢిల్లీలో తెలంగాణ గళం వినిపించాలన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి నిధులు తీసుకువస్తా అన్నారు. నన్ను ఓడించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ఎన్నో ప్రయత్నాలు చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఎన్ని నేరవేర్చిందో తెలుసని, రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయో వారికే తెలియాలన్నారు. మహిళలకు పింఛన్లు, కల్యాణలక్ష్మికి బంగారు పంపిణీ ఏమయ్యాయో చెప్పాలి. ఎన్నికల కోడ్ అంటూ కాంగ్రెస్ నాయకులు తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రైతు రుణమాఫీ గెలిచిన వెంటనే చేస్తామన్నారు. ఇప్పుడేమో ఆగస్టు 15 అంటున్నారు. ఓట్లు అయిపోతే వాళ్లు మళ్లీ మీకు కనపించరని విమర్శించారు. ఆర్‌ఎస్‌పీకి మాదిగ సంఘాల పూర్తిస్థాయిలో మద్దతుగా ఉంటామని ప్రకటించారు. ఆయన గెలుపుకోసం పనిచేస్తామన్నారు. సమావేశంలో రవి, విజయ్, జంబులయ్య, లక్ష్మయ్య, రామకృష్ణ, రామన్న, బ్రహ్మయ్య, మద్దిలేటి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

కల్లు తాగించి.. లైంగికదాడి చేసి..

- మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడికి రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ యోగేష్ గౌతమ్


హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట: కల్లు తాగించి, లోబర్చుకునే క్రమంలో నిరాకరించిన మహిళను ఓ కామాంధుడు అతి కిరాతకంగా హతమార్చాడు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ వెల్లడించారు. దామరగిద్దలోని లక్ష్మీనగర్ కాలనీలో ఎనికల లక్ష్మప్ప అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. అతడి భార్య 8 ఏళ్ల కిందట చనిపోయింది. పెద్ద కూతురి వివాహం కాగా.. మిగతా పిల్లలు హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న లక్ష్మప్పకు రోజు కల్లు తాగే అలవాటు ఉంది. ఎప్పటిలాగే ఏప్రిల్ 25న గ్రామంలోని కల్లు దుకాణానికి వెళ్లాడు. ఈక్రమంలో దామరగిద్దలో తన భర్తతో కలిసి నివాసముంటున్న నర్సాపూర్ గ్రామవాసి సవిత (40) తన కూతురితో కలిసి కల్లు దుకాణానికి వచ్చింది. తన వద్ద డబ్బులు లేవని.. తనకు కల్లు తాపాలని లక్ష్మప్పను కోరగా, కల్లు తాగించాడు. ఆ తర్వాత ఒకరి సెల్‌నంబర్ మరొకరు తీసుకున్నారు. అక్కడి నుంచి ఇద్దరు నడుచుకుంటూ లక్ష్మప్ప ఇంటికి చేరుకున్నారు. మీ పాపను ఇంటి వద్ద వదిలిపెట్టి వస్తే మరో సీసా కల్లు తాపుతానని ఆశ చూపాడు. దీంతో ఆమె తన కూతురిని పక్కింట్లో వదిలిపెట్టి అతడి ఇంటికి వచ్చింది. ఆమెకు మరో సీసా కల్లు తాగించిన తర్వాత లైంగిక దాడికి పాల్పడ్డాడు. కొంతసేపటి తర్వాత మరోసారి లైంగికదాడికి పాల్పడటానికి యత్నించగా.. ఆమె ఒప్పుకోలేదు. దీంతో ఆగ్రహానికి గురైన అతడు.. గొడ్డలి కర్రతో సవిత తలపై మోదడంతో తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె సెల్‌ఫోన్‌ను సమీపంలోని పొలంలో విసిరేసిన లక్ష్మప్ప.. ఇంట్లోనే ఆమె మృతదేహాన్ని ఉంచి, 26వ తేదీ తెల్లవారుజామున అక్కడి నుంచి పరారయ్యాడు. కాగా, అదే రోజు సాయంత్రం దామరగిద్దకు చెందిన జోగు బాలప్ప అనే వ్యక్తి చనిపోవడంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చాడు. అయితే ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో భయపడిన అతడు.. డయల్ 100కు ఫోన్ చేసి, తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి ఓ ఆడ మనిషిని ఉంచి వెళ్లారని నమ్మబలికాడు. అతడిపై అనుమానం వచ్చిన పోలీసులు అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా.. తాను చేసిన నేరం ఒప్పుకొన్నాడు. సవితను చంపడానికి ఉపయోగించిన గొడ్డలి కర్ర, విసిరేసిన సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మప్పని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన డీఎస్పీ ఎన్.లింగయ్య, సీఐ శివశంకర్, దామరగిద్ద ఎస్‌ఐ వసంత, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

చెరువులో పడి వృద్ధురాలు మృతి

ఖిల్లాఘనపురం: చెరువులో పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని సల్కెలాపురంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రాగనమోని బాలమ్మ (65) కొన్నేళ్లుగా చిన్నకుమారుడు సంజీవతో ఉంటుంది. సోమవారం రాత్రి తర్వాత కనిపించలేదు. మంగళవారం గ్రామ సమీపంలోని ఉప్పరివాని చెరువులో మృతదేహం లభించింది. గమనించిన కొందరు గ్రామస్తులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీసి పరిశీలించారు. వృద్ధురాలు చెరువులో ఎందుకు పడిందనేది అనుమానంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

రాజాపూర్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవి వివరాల మేరకు.. రాజాపూర్‌కు చెందిన వనపర్తి గోపాల్ (65) జాతీయ రహదారిని దాటుతుండగా.. హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



ఖరీదు కట్టే షరాబు లేదు

ఇంతకు ముందు వివరించి చెప్పడం కొంత కష్టమయ్యేది. ఇప్పుడు అర్బన్ క్లాప్ వంటి సంస్థలు వచ్చాయి కనుక సులువు. అర్బన్ క్లాప్ వారికి బాత్‌రూమ్‌ల క్లీనింగ్ కోసం కాల్ చేస్తే వాళ్లు ఒక్కో బాత్‌రూమ్‌కు ఇంతని చార్జ్ చేస్తారు. ఇంట్లో రెండుంటే రెంటికీ చార్జ్ పడుతుంది. అదీ ఒకసారికి. అమ్మ వారంలో రెండు సార్లు, నెలలో ఏడెనిమిది సార్లు రెండు బాత్‌రూమ్‌లు కడుగుతుంది. ఆమెకు ఆ చార్జ్ మొత్తం ఇవ్వాలి లెక్క ప్రకారం. అలాగే కిచెన్ క్లీన్ చేయాలంటే కూడా ఒక చార్జ్ ఉంటుంది. అమ్మ రోజూ వంటిల్లు సర్ది సర్ది, ప్లాట్‌ఫామ్ కడిగి, స్టవ్ రుద్ది క్లీన్ చేస్తుంది. ఆ చార్జ్ కూడా ఆమెకు ఇవ్వాలి. అమ్మ శ్రమకు కనీసం విలువ కట్టాలని కొన్ని సందర్భాలలో కోర్టులు కూడా అంటున్నాయి. కొన్ని సంస్థలు అమ్మ శ్రమను ఎలా విలువ కట్టవచ్చో కూడా చెబుతున్నాయి.



1. ఆపర్చునిటీ కాస్ట్ మెథడ్:
అంటే అమ్మ బయటకు వెళ్లి ఉద్యోగం చేస్తే నలభై వేలు వస్తాయనుకుంటే, ఆమె ఆ ఉద్యోగం మానుకుని ఇంట్లో ఉండిపోతే ఆమె శ్రమ విలువను నెలకు నలభై వేలుగా గుర్తించాలి. (అమ్మ ఉద్యోగం చేసి కూడా అంత శ్రమా చేస్తుంటే నలభైకి మరో నలభై కలిపి ఇంటికి ఇస్తున్నట్టు).

2. రీప్లేస్‌మెంట్ కాస్ట్ మెథడ్:
ఇల్లు చిమ్మడం, బట్టలుతకడం, ఆరిన బట్టల్ని మడత పెట్టడం, ఇస్త్రీ చేయడం, మొక్కలకు నీళ్లు పోయడం, కూరగాయలు, సరుకులు తెచ్చుకోవడం, బిల్లులు కట్టడం, వంట చేయడం, ఇంటిని కనిపెట్టుకుని ఉండటం... వీటన్నింటినీ బయట వ్యక్తులతో సర్వీసుగా తీసుకుంటే (అర్బన్ క్లాప్ మాదిరిగా) ఎంత అవుతుందో లెక్కగట్టి అది అమ్మ చేసే పని శ్రమగా గుర్తించడం.

3. ఇన్‌పుట్/అవుట్‌పుట్ కాస్ట్ మెథడ్:
అలా కాకుండా ఈ పనులన్నింటికీ ఒక యోగ్యమైన ఉద్యోగిని పెట్టుకుంటే మార్కెట్ అంచనాను బట్టి ఎంత జీతం ఇవ్వాల్సి వస్తుందో అంత జీతం ఇవ్వడం.

అవన్నీ సరే. కంటికి కనిపించే పనులకు కట్టే విలువ. కాని పిల్లవాడు స్కూల్లో పడి దెబ్బ తగిలించుకుని ఇంటికి వస్తే అమ్మ దగ్గరకు తీసుకుని, మందు రాసి, ధైర్యం చెప్పి, వాడి పక్కన కూచుని కబుర్లు చెపుతుందే... ఆ ప్రేమకు విలువ కట్టే షరాబు ఉన్నాడా?

మే డే రోజున ప్రపంచ కార్మికులారా ఏకం కండి అనే నినాదాలు వినిపిస్తుంటాయి. కాని ఇంటి పని చేస్తూ, అది ఎక్కువైనా చేస్తూ, కుటుంబమంతా ఆ పనిలో భాగం కావాలన్న సంగతిని చెప్పడానికి కూడా తటపటాయిస్తూ, అది వద్దనుకుంటే ఆ ఆప్షన్ లేక, తప్పించుకోవడానికి వీల్లేని ఆ పనిని చేస్తూ కూడా విలువ లేని పని చేస్తున్నామన్న న్యూనతను అనుభవిస్తూ తమ హక్కులు ఏమిటో తమకే తెలియని తల్లి, భార్య, కుమార్తె, చెల్లెళ్లను కార్మికులుగా గుర్తించాలని ఎవరూ అనుకోరు.

స్త్రీల ఇంటి శ్రమ దేశంలోని యంత్రాంగం సజావుగా పనిచేయడంలో కీలకమైనది. వారు...
1. దేశం కోసం పని చేసి రిటైరైన వృద్ధుల సేవలో ఉంటారు. 2. దేశానికి ఆదాయం తెచ్చిపెట్టే యువత సేవలో ఉంటారు. 3. దేశానికి భవిష్యత్తులో అంది రావాల్సిన పిల్లల సేవలో ఉంటారు.

'కుటుంబం' అనే బంధంలోకి వచ్చి కూతురిగా, కోడలిగా, భార్యగా వీరు 'ప్రేమ'తో, 'బాధ్యత'తో, 'బంధం'తో ఈ సేవ చేస్తారు. అంత మాత్రం చేత ఈ సేవను నిరాకరించడానికి వీల్లేదు. శ్రమగా చూడక్కర్లేదని భావించకూడదు. ఇంత చేస్తున్నా 'ఇంట్లో కూచుని ఏం చేస్తుంటావ్?' అనే మాటను వాళ్లు పడాలా?

ఉద్యోగం చేసినా చేయకపోయినా ఒక గృహిణి రోజుకు సగటున మూడున్నర గంటలు ఇంటి పని చేస్తుంటే పురుషుడు కేవలం గంటన్నర ఇంటి పని చేస్తున్నాడు.

స్త్రీలు తమ ఇంటి పనిని ఒక్కరోజు మానేసి సహాయనిరాకరణ చేస్తే దేశం స్తంభిస్తుంది. అందుకే స్త్రీల శ్రమను గౌరవించే మే డే రోజున వారికి కృతజ్ఞతలు తెలియచేయాలి. విలువైన శ్రమ చేస్తున్నందుకు సమాజం వారికి హర్షధ్వానాలు తెలియచేయాలి.



1. సాచి 2. ఇలీన హ్యాట్స్ 3. అవంతి 4. అనన్య నందా 5. అంకిత కుందు 6. రణిత బెనర్జీ 7. లిష మిత్రా 8. మిథాలీ ఠాకూర్ 9. దియా వదిరాజ్

సెల్ఫ్-మేడ్ మ్యూజిక్ స్టార్స్

క్షణ క్షణం సంగీత పర్వం

యూత్ పల్స్

యువ సంగీతాభిమానులకు అచ్చంగా సరి పోయే మాట... మ్యూజిక్ మేక్స్ ఎవ్రీ థింగ్ బెటర్. ఇట్టే మరిచిపోయే లక్షణం నుంచి జ్ఞాపకశక్తి పెరగడం వరకు, క్రియేటివిటీని ఎంజాయ్ చేయడం నుంచి క్రియేటివ్ పవర్ పెంచుకోవడం వరకు, జడత్వం నుంచి నిత్యజీవనోత్సాహం వెల్లివిరియడం వరకు, అనామకత్వం నుంచి ప్రపంచం గుర్తించే స్థాయికి ఎదగడం వరకు ఎన్నోరకాలుగా సంగీతం యువతకు బలం అయింది. సంగీత రత్నాలను వెదుకుతూ మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలోకి అడుగు పెట్టిన యువతరం ఆ ప్లాట్‌ఫామ్‌లలోనే మ్యూజిక్ స్టార్‌లుగా మెరవడం ఈ తరంలో కనిపిస్తున్న ప్రత్యేకత.

ఆరు సంవత్సరాల వయసులో పాటల కోసం గొంతు సవరించింది బెంగళూరుకు చెందిన దియా వదిరాజ్. రకరకాల మ్యూజిక్ జానర్‌లలో టాలెంటెడ్ సింగర్‌గా పేరు తెచ్చుకుంది. కోల్‌కతాకు చెందిన రనితా బెనర్జీ అయిదు సంవత్సరాల వయసులో 'సింగింగ్ స్టార్' షోలో పాల్గొంది. 'స రే గ మ ప' లిటిల్ ఛాంప్స్‌లో ఫస్ట్ రన్నర్-అప్‌గా నిలిచింది. 'స్వీట్ వాయిస్' రనిత గొంతు నుంచి వచ్చిన 'జరాసీ ఆహట్' పాట 6.2 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

మల్టీ టాలెంటెడ్ సింగర్‌గా పేరు తెచ్చుకుంది అంకిత కుందు. రియాల్టీ షోలలో పాడడం ద్వారా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. బిహార్‌కు చెందిన మిథాలీ ఠాకూర్ 'రైజింగ్ స్టార్' షోతో ఫేమ్ అయింది. భోజ్‌పురి, క్లాసికల్, ఫోక్ సాంగ్స్‌ను పాడడంలో మంచి పేరు తెచ్చుకుంది. యూట్యూబ్‌లో ఆమె వీడియోలు మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకున్నాయి. ఇండియన్-అమెరికన్ సింగర్, సాంగ్ రైటర్ లిశా మిత్రా పాటలను రికార్డ్ చేసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసేది. బాలీవుడ్ సినిమాలలో కూడా పాడింది. ఇండియన్ ఐడల్ జూనియర్‌గా 2015లో సంగీత ప్రపంచానికి పరిచయం అయింది భువనేశ్వర్‌కు చెందిన అనన్య నందా. బాలీవుడ్ పాటల్లోనే కాదు క్లాసికల్‌లోనూ మంచి పేరు తెచ్చుకుంది. మెలోడియస్ వాయిస్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది.

బోస్టన్ (యూఎస్)లో పుట్టిన అవంతి నగ్రల్‌కు చిన్నప్పటి నుంచి సంగీతం అంటే ఇష్టం. ముంబైకి వచ్చిన తరువాత తన పాషన్‌నే కెరీర్‌గా చేసుకుంది. మ్యూజిక్‌లో రకరకాల జానర్స్‌ను మిక్స్ చేయడంలో గట్టి పట్టు సాధించిన అవంతికి యూట్యూబ్ చానల్ కూడా ఉంది. ఇందులో తన లైవ్ పర్‌ఫార్‌మెన్స్ వీడియోలను అప్‌లోడ్ చేస్తుంది. అవంతికి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు.

ఆర్ అండ్ బీ, హిప్-హాప్, సోల్, పాప్ మ్యూజిక్‌లలో బహుముఖ ప్రజ్ఞ చాటుకుంటోంది ఇలీన హ్యాట్స్. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చింది. ముంబైకి చెందిన సాచి రాజాధ్యక్ష ఆల్ట్-పాప్ మ్యూజిక్‌లో అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది. ఆమె పవర్‌ఫుల్, సోల్ వాయిస్‌కు ఎంతోమంది అభిమానులు ఉన్నారు.

దియ నుంచి అవంతి వరకు ఎందరో, ఎందరెందరో యంగ్ మ్యూజిషియన్స్ సంగీతం పట్ల అంకితభావంతో సెల్ఫ్-మేడ్ సూపర్‌స్టార్‌లుగా ఎదిగారు. ఎంతోమంది ఔత్సాహికులకు రోల్ మోడల్స్‌గా మారారు.



స్పాటిఫైతో ప్రయాణం ప్రారంభించి స్టార్‌గా ఎదిగిన ఆర్టిస్ట్‌లలో జస్లీన్ రాయల్ ఒకరు. సింగర్, సాంగ్ రైటర్, కంపోజర్‌గా మంచి పేరు తెచ్చుకుంది. హిట్ బాలీవుడ్ ట్రాక్స్ కంపోజ్ చేసింది. 'ప్రపంచ ప్రేక్షకులతో కనెక్ట్ కావడానికి, శ్రోతల అభిప్రాయాలను తెలుసుకొని అందుకు అనుగుణంగా మ్యూజిక్ కంపోజింగ్‌లో మార్పులు చేయడానికి స్పాటిఫై ఉపయోగపడింది' అంటుంది జస్లీన్ రాయల్.

సినిమా

- తొలి సినిమా స్కోప్ ఈస్ట్‌మన్ కలర్ చిత్రం
- రూ. రెండు కోట్లు వసూలు చేసిన తొలి తెలుగు చిత్రం
- జాతీయ అవార్డు తెచ్చుకున్న తొలి తెలుగు పాట 'తెలుగు వీర లేవరా...'
- ఉత్తమ చిత్రంగా నంది పురస్కారం

అల్లూరికి అర్ధ శతాబ్దం

'మా మన్యం దొర సీతారామరాజు వచ్చాడు'.... ప్రజల్లో సంబరం. దొరకు పాదాభివందనం చేశారు. కానీ... అతను నిజమైన దొర కాదు. మన్యం దొర అల్లూరి సీతారామ రాజు గెటప్ వేసుకున్న నటుడు. అప్పటికి నిజమైన అల్లూరి సీతారామరాజుని చూసిన కొందరు వృద్ధులు లొకేషన్లో ఆ గెటప్‌లో ఉన్న నటుడికి పాదాభివందనం చేశారు. వెండితెరపై సీతారామరాజుగా కనిపించక ముందే అలా షూటింగ్ లొకేషన్లో ప్రజల చేత 'భేష్' అనిపించుకున్నారు కృష్ణ. అల్లూరి సీతారామరాజు గెటప్ అంటే కృష్ణ తప్ప వేరే ఏ నటుడికీ నప్పదు అనేంతగా ఆ పాత్రలో ఒదిగిపోయారు సూపర్ స్టార్. 1974 మే 1న విడుదలైన 'అల్లూరి సీతారామరాజు' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ చిత్రం యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కొన్ని విశేషాలు తెలుసుకుందాం...



ఎన్టీఆర్ హీరోగా నటించిన 'అగ్గిరాముడు' సినిమా 1954 ఆగస్టు 5న విడుదలైంది. బుర్రిపాలెంకు చెందిన కృష్ణ తెనాలిలో ఆ సినిమా చూశారు. అందులో అల్లూరి గురించి బుర్రకథగా చెప్పే సీన్ కృష్ణను ఆకట్టుకుంది. ఆ తర్వాత ఎన్టీఆర్ నటించిన 'జై సింహ'ని కూడా చూశారు కృష్ణ. ఆ సినిమా పాటల పుస్తకం చివరి పేజీలో ఎన్టీఆర్ తర్వాతి చిత్రం 'అల్లూరి సీతారామరాజు' అనే ప్రకటనతో పాటు అల్లూరి గెటప్‌లో స్కెచ్‌తో గీసిన ఎన్టీఆర్ బొమ్మ ఉంది. ఆ సినిమా కోసం కృష్ణ ఎదురు చూశారు. అయితే ఆ సినిమా ప్రారంభమైనా తర్వాత ఆగిపోయింది. పై చదువుల కోసం ఏలూరు వెళ్లిన కృష్ణకి నాటకాలపై ఆసక్తి కలిగింది. అది కాస్తా సినిమాలవైపు మళ్లడంతో చెన్నైకి చేరుకున్నారు. అప్పుడు ప్రజా నాట్యమండలి రాజారావు బృందం ప్రదర్శించిన 'అల్లూరి సీతారామరాజు' నాటకానికి మంత్రముగ్ధుడయ్యారు కృష్ణ. ఆ తర్వాత హీరో అయిన కృష్ణ 'అసాధ్యుడు'లో (1968) అంతర్నాటకంలో భాగంగా సీతారామరాజు వేషం వేశారు. ఆ వేషంలో చక్కగా ఉన్నారంటూ జనాలు కితాబిచ్చారు. దీంతో తాను హీరోగా అల్లూరి చరిత్రతో సినిమా తీస్తే బాగుంటుందనుకున్నారు కృష్ణ. అయితే 1972లో శోభన్‌బాబు హీరోగా సీతారామరాజు మూవీ నిర్మించనున్నట్లు డి. లక్ష్మీ నారాయణ (డీఎల్) ప్రకటించారు. కానీ అనారోగ్యం వల్ల ఆ ప్రయత్నం విరమించుకున్నారాయన. కృష్ణ హీరోగా 'పెద్దలు మారాలి' సినిమా తీశారు డీఎల్. ఆ చనువుతో సీతారామరాజు కథని కృష్ణకి ఇచ్చి, ఆసక్తి ఉంటే సినిమా తీసుకోమన్నారు. అలా 'అల్లూరి సీతారామరాజు' చేసే అవకాశం కృష్ణకి వచ్చింది.



డేరింగ్ అండ్ డ్యాషింగ్ కృష్ణ

కృష్ణకు 'డేరింగ్ అండ్ డ్యాషింగ్' అని పేరు. 'అల్లూరి సీతారామరాజు' కథలో వాణిజ్యపరమైన అంశాలు ఉండవని, పైగా హీరో చనిపోతాడని ఫైనాన్స్ ఇవ్వడానికి ఫైనాన్షియర్లు, పంపిణీ చేయడానికి కూడా ఎవరూ సాహసించలేదు. 'ఇంత రిస్క్ అవసరమా.. ఈ సినిమా వద్దు' అని శ్రేయోభిలాషులు కృష్ణకు చెప్పారు. ఎన్టీఆర్ కూడా వద్దనే అన్నారు. అయినా తాను ఓ హీరోగా రూపొందిన 'దేవుడు చేసిన మనుషులు' శత దినోత్సవంలో అల్లూరి సీతారామరాజు సినిమా తీస్తున్నానని, అది తన నూరో చిత్రంగా ఉంటుందని కృష్ణ ప్రకటించారు. 1973 డిసెంబరులో మద్రాస్ వాహినీ స్టూడియోలో షూటింగ్ ఆరంభమైంది. అల్లూరి సీతారామరాజు గెటప్‌లో ఉన్న కృష్ణపై ఫస్ట్ షాట్ తీశారు. సినిమా మొదలుపెట్టినప్పట్నుంచి అనేక ఇబ్బందులు. చింతపల్లి అడవిలో షూటింగ్ కాబట్టి అక్కడ గెస్ట్ హౌస్‌లు లేకపోవడంతో యూనిట్‌లోని దాదాపు ఐదువందల మందికి ఒక కాలనీలా తాత్కాలిక బస ఏర్పాటు చేశారు. సముద్ర మట్టానికి నాలుగువేల అడుగుల ఎత్తులో కొండ ప్రాంతంలో షూటింగ్. భయంకరమైన చలి. దాదాపు 40 రోజుల పాటు షూటింగ్ చేశారు. దర్శకుడు రామచంద్రరావు అస్వస్థతకి గురి కావడం ఓ ఊహించని షాక్. ఆయన్ను చెన్నైకి తీసుకెళ్లి, మెరుగైన వైద్యం చేయించినా కోలుకోలేదు. ఫిబ్రవరి 14న తుది శ్వాస విడిచారు. మిగతా భాగాన్ని కృష్ణ తెరకెక్కించారు. యుద్ధ సన్నివేశాలను దర్శకుడు కేఎస్ఆర్ దాస్ రూపొందించారు. రామచంద్రరావు మీద గౌరవంతో దర్శకుడిగా ఆయన పేరే ఉంచేశారు కృష్ణ.

సినిమా స్కోప్.. ఈజీ కాదు

తెలుగులో పూర్తి స్థాయిలో రూపొందిన తొలి సినిమా స్కోప్ ఈస్ట్‌మన్ కలర్ చిత్రం 'అల్లూరి సీతారామ రాజు'. అయితే అప్పుడు సినిమా స్కోప్ అంత ఈజీ కాదు. ఈ మూవీకి వీఎస్ఆర్ స్వామి ఛాయాగ్రాహకుడు. అప్పట్లో సినిమా స్కోప్ ఫార్మాట్‌లో తీసేందుకు రెండే లెన్స్‌లు ఉండేవట. కాగా సినిమా స్కోప్ ఫార్మాట్‌లో తీసే లెన్స్‌కి కెమెరా వ్యూఫైండర్స్ ఉండవట. దీంతో ఊహించుకుని ఫ్రేమ్ సెట్ చేసుకునేవారట. ఈ ప్రక్రియను వీఎస్ ఆర్ స్వామి ముంబైలో అధ్యయనం చేసి రావడంతో 'అల్లూరి సీతారామరాజు' ఈజీగా చేయగలిగారు.

'అల్లూరి...' తర్వాత 'పాడి పంటలు'తోనే హిట్... 'అల్లూరి సీతారామరాజు' చూసిన విజయా వాహిని సంస్థ అధినేతల్లో ఒకరైన దర్శక-నిర్మాత చక్రపాణి అభినందించారు. కానీ 'ఈ సినిమా తర్వాత నీ సినిమాలు ఆడటం కష్టం' అని కూడా కృష్ణతో అన్నారు. ఆయన అన్న మాటలు నిజమయ్యాయి. 'అల్లూరి సీతారామరాజు' తర్వాత కృష్ణ చేసిన ప్రతి చిత్రాన్నీ ఈ సినిమాతో పోల్చారు ప్రేక్షకులు. దాంతో ఆ తర్వాత కృష్ణ నటించిన పది సినిమాలకు పైగా ఆశించిన ఫలితాన్ని సాధించలేదు. చివరికి పద్మాలయా స్టూడియోస్ నిర్మించిన 'పాడి పంటలు' (1976) విజయంతో హీరోగా కృష్ణ పూర్వ వైభవాన్ని పొందారు.

అల్లూరి చేయనన్న ఎన్టీఆర్

అల్లూరి సీతారామరాజు సినిమా మొదలుపెట్టి, ఆపినా ఆ సినిమా తీయాలన్న ఎన్టీఆర్ ఆకాంక్ష అలాగే ఉండిపోయింది. కృష్ణ 'అల్లూరి సీతారామరాజు' వచ్చిన చాలా ఏళ్లకు ఆ సినిమా తీద్దామని పరుచూరి బ్రదర్స్‌తో అన్నారు ఎన్టీఆర్. కానీ సోదరులు వద్దని సలహా ఇచ్చి, కృష్ణ చేసిన సినిమా చూడమన్నారు. ఎన్టీఆర్ కోరిక మేరకు 'అల్లూరి సీతారామరాజు'ని ప్రత్యేకంగా చూపించారు కృష్ణ. "అద్భుతంగా తీశారు. నేను 'అల్లూరి సీతారామరాజు' తీయను" అన్నారు ఎన్టీఆర్.

మహారథి చేతికి స్క్రిప్ట్

త్రిపురనేని మహారథి చేతిలో డీఎల్ ఇచ్చిన స్క్రిప్ట్ పెట్టి, 'ఈ సబ్జెక్ట్‌లో సినిమా తీయడానికి కావాల్సినంత దమ్ము ఉందా' అడిగారు కృష్ణ సోదరుడు హనుమంతరావు. 'చాలా ఉంది' అన్నారు మహారథి. కానీ, తనకు ఇచ్చిన స్క్రిప్ట్‌లో ఒక్క సన్నివేశం తప్ప మహారథికి వేరే ఏదీ నచ్చలేదు. పరిశోధనలు చేసి, స్క్రిప్ట్ తయారు చేశారు. దర్శకుడిగా వి. రామచంద్రరావును తీసుకున్నారు. సినిమా స్కోప్ ఈస్ట్‌మన్ కలర్‌లో తీయాలని నిర్ణయించింది పద్మాలయా స్టూడియోస్ సంస్థ (కృష్ణ సొంత నిర్మాణ సంస్థ).

అల్లూరి పాటలు అజరామరం

'అల్లూరి సీతారామరాజు'లోని పాటలన్నీ సూపర్ హిట్. పి. ఆదినారాయణరావు ఈ సినిమాకు సంగీత దర్శకుడు. సినిమా ఆరంభంలో వచ్చే 'రగిలింది విప్లవాగ్ని..', సినిమా చివర్లో వచ్చే.. 'ఓ విప్లవజ్యోతి...' పాటలకు ఆరుద్ర సాహిత్యం అందించగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడారు. 'వస్తాడు నా రాజు..' పాటను నారాయణరెడ్డి రాయగా, 'హైలెస్సా.. హైలెస్సా..', 'కొండ దేవతా నిన్ను కొలిచేవమ్మా..' పాటలను కొసరాజు రాశారు. 'తెలుగు వీర లేవరా..' పాటను శ్రీశ్రీ రాశారు. ఈ పాటను ఘంటసాలతోనే పాడించాలన్నది కృష్ణ సంకల్పం. ఆ సమయానికి ఘంటసాల ఆరోగ్యం సరిగా లేదు. ఆ తర్వాత ఘంటసాల ఆరోగ్యం కాస్త కుదుటపడటంతో ఆయన ఈ పాట పాడారు. కానీ ఈ సినిమా విడుదల కాకముందే ఘంటసాల కాలం చేశారు. ఈ పాటకు వి. రామకృష్ణ గొంతు కలిపారు. ఈ పాటకుగాను జాతీయ ఉత్తమ గీత రచయిత అవార్డు శ్రీశ్రీని వరించింది. ఓ తెలుగు సినిమాలోని పాటకు జాతీయ పురస్కారం రావడం అదే తొలిసారి. అలాగే ఇదే సినిమాలోని 'వందేమాతరం అంటూ నినదించిన..', 'హ్యాపీ క్రిస్మస్..' పాట, 'అరుణాయ శరణ్యాయ..' శ్లోకం వంటివి కూడా వీనుల విందుగా ఉంటాయి.

రికార్డులు భళా

'అల్లూరి సీతారామరాజు' సినిమా 19 కేంద్రాల్లో (బెంగళూరుతో కలుపుకుని) వందరోజులు, 2 కేంద్రాల్లో 25 వారాలు, హైదరాబాద్‌లోని సంగం థియేటర్‌లో రజతోత్సవం, అలాగే షిఫ్టింగులతో ఏడాది పాటు ఆడటం విశేషం. ఈ చిత్రం స్వర్ణోత్సవం చెన్నైలోని ఉడ్‌ల్యాండ్స్ హోటల్‌లో ఘనంగా జరిగాయి. స్వాతంత్ర్య సమరయోధులు ఇంటూరి వెంకటేశ్వరరావు, అనిసెట్టి సుబ్బారావు, దాశరథి, సుంకర సత్యనారాయణ, కేఎస్ గోపాలకృష్ణన్ వంటి వారిని సత్కరించారు. అల్లూరి సీతారామరాజు కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం రూ. పదివేలతో ఓ ట్రస్టు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి, అందుకు సంబంధించిన పత్రాలను సీతారామరాజు సోదరుడు సత్యనారాయణరాజుకి అందించారు కృష్ణ. ఇలా ఈ సినిమాకి సంబంధించిన విశేషాలు చాలా ఉన్నాయి.

ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు



● అబ్బూరి రవి

'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా హీరో హీరోయిన్లుగా మల్లి అంకం దర్శకత్వంలో రాజీవ్ చిలక నిర్మించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. ఈ చిత్రం ఈ నెల 3న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఈ చిత్రం డైలాగ్ రైటర్ అబ్బూరి రవి మాట్లాడుతూ– ''ఈ సినిమాలో పెళ్లి అనే సబ్జెక్ట్‌ను వినోదాత్మకంగా చూపిస్తూనే, ఆడియన్స్ ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యేలా తీశాం. ముఖ్యంగా ఇది పెళ్లి కాని ప్రతి వారు కోరుకునే కంటెంట్. క్లీన్ ఎంటర్‌టైనర్. 'ఆ ఒక్కటీ అడక్కు' అనేది ఈవీవీగారి క్లాసిక్ టైటిల్. ఈ సినిమాకు ఈ టైటిల్‌ను అన్నప్పుడు కాస్త భయం వేసింది. కానీ ఈ కథకు ఆ టైటిల్ సరిగ్గా సరిపోతుందని నరేశ్‌గారే సూచించారు. ఇక నాకు డైరెక్షన్ చేయాలని ఉంది. ఆ ప్రయత్నాల్లో ఉన్నాను. ప్రస్తుతం 'గూఢచారి 2', 'డెకాయిట్' సినిమాలకు వర్క్ చేస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు.

ముఫాసా ఈజ్ బ్యాక్



హాలీవుడ్ లయన్ కింగ్ మళ్లీ వస్తున్నాడు. 1994లో వచ్చిన యానిమేటెడ్ మ్యూజికల్ డ్రామా 'ది లయన్ కింగ్' ఆధారంగా 'ది లయన్ కింగ్' టైటిల్‌తోనే సినిమా వచ్చింది. జోన్ ఫావ్రూ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ముఫాసా, సింబ (ముఫాసా తనయుడు), ముఫాసా తమ్ముడు స్కార్‌లు ప్రధాన పాత్రధారులుగా 'ది లయన్ కింగ్' సినిమా కథనం సాగుతుందన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు 'ది లయన్ కింగ్' సినిమాకు ప్రీక్వెల్‌గా 'ముఫాసా: ది లయన్ కింగ్' చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రం ట్రైలర్, ఫస్ట్ లుక్ విడుదలైంది. డిసెంబరు 20న 'ముఫాసా: ది లయన్ కింగ్' రిలీజ్ కానుంది.

వినూత్న కథాంశంతో...



● విరాజ్ అశ్విన్, రవితేజ మహాదాస్యం

రవితేజ మహాదాస్యం హీరోగా మద్దుల మదన్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న నూతన చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఆర్ట్ మేకర్స్ సమర్పణలో సౌజన్య కావూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రచయిత పురాణపండ శ్రీనివాస్ కెమెరా స్విచ్చాన్ చేయగా, తొలి సీన్‌కి విరాజ్ అశ్విన్ క్లాప్ ఇచ్చారు. ఓ వినూత్న కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నితిన్ రెడ్డి చిమ్ముల, సహనిర్మాతలు: దియా, సంజీవ్ కోనేరు, వెంకట్ రమణారెడ్డి.

తిండిబోతు దెయ్యం



● నరసింహా, మోనిక, వాసవి

నరసింహా బోదాసు హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న కామెడీ హారర్ ఫిల్మ్ 'తిండిబోతు దెయ్యం'. మోనికా సమత్తార్, తన్నీరు వాసవి హీరోయిన్లు. శిరీష నరసింహా బోదాసు నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత శిరీష నరసింహా బోదాసు కెమెరా స్విచ్చాన్ చేయగా, సీనియర్ దర్శకుడు రేలంగి నరసింహారావు క్లాప్ ఇచ్చి, యూనిట్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ''ఈ సినిమాలో కొత్తదనం ఉంటుంది'' అన్నారు నరసింహా బోదాసు.